సాక్షి నిజామాబాద్

మంగళవారం । 21 । మార్చి । 2023



సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు.

- 8లో ▸



పిల్లలపై నిఘా పెట్టాలి

పిల్లల అలవాట్లపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని, మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని సీపీ నాగరాజు పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.6 /20.0

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం మబ్బుపట్టి ఉండవచ్చు. రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పీడ్‌పోస్టులో శ్రీరామ నవమి తలంబ్రాలు

నిజామాబాద్ సిటీ : భద్రచలంలో ఈ నెల 30న శ్రీరామ నవమి సందర్భంగా జరిగే సీతారాముల కల్యాణం తలంబ్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా ఇంటివద్దకే అందించనున్నట్లు తపాలాశాఖ నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ ఉమా మహేశ్వర్ తెలిపారు. సీతారాముల కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలు కావాలనుకునే వారు తపాలశాఖలో రూ. 150లు చెల్లిస్తే 20 గ్రాముల తలంబ్రాలు, రెండు ముత్యాలు, శ్రీరాముల వారి ప్రసాదం స్పీడ్ పోస్ట్‌లో నేరుగా ఇంటికే వస్తుందన్నారు. అలాగే రూ. 450లు చెల్లిస్తే భద్రచలంలో గోత్రనామాలపై అర్చన చేయించటం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఈ నెలా 27 లోపు తమ దగ్గరలో ఉన్న తపాల కార్యాలయం లేదా, పోస్ట్‌మ్యాన్‌కు రుసుము చెల్లించి తమ పేరు, గోత్రనామాలు, వివరాలను నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా ఉమా మహేశ్వర్ సూచించారు.

విద్యాసంస్థలు తప్పనిసరి గుర్తింపు పొందాలి

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు తప్పనిసరిగా గుర్తింపు పొందాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కొన్ని పాఠశాలలు కోచింగ్ సెంటర్లు గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయని వెంటనే ఆయా విద్యాసంస్థలు గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తెయూ వీసీకి ఉగాది పురస్కారం



తెయూ(డిచ్‌పల్లి) : హైదరాబాద్ రవిశ్రీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఉగాది మహోత్సవం కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్‌కు ఉగాది పురస్కారం–2023 అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



తెయూ(డిచ్‌పల్లి) : పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతిఒక్కరి బాధ్యత అని, మనం రాబోయే తరాలకు కాలుష్యరహిత ప్రపంచాన్ని అందించాలని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల సెమినార్‌హాల్‌లో సోమవారం 'ఇతోస్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ లా' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. పర్యావరణ చట్టం తయారు చేసేందుకు దారితీసిన అంశాలను వివరించారు. విద్యార్థులు పర్యావరణ రక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె ప్రసన్న రాణి, హెచ్‌వోడీ బి స్రవంతి, అధ్యాపకులు బి నాగజ్యోతి, నర్సయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

నిజామాబాద్ సిటీ: శ్రీ శోభకృత్ ఉగాదిని పురస్కరించుకొని నేడు (మంగళవారం) సాయంత్రం నాలుగు గంటలకు తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నేడు 'వసంతాన్ని పిలుద్దాం రా' అనే శీర్షికన కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి గుత్ప ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి సభా సామ్రాట్ వీపీ చందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కవయిత్రులు, కవులు కవితా గానంతో ఉగాదికి స్వాగతం పలుకుతారని తెలిపారు. ఔత్సాహికులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కేసీఆర్ సర్కారును ఇంటికి పంపిద్దాం

- రుణమాఫీ చేయక రైతుల అప్పులు రెండింతలయ్యాయి
- బ్యాంకోళ్లు నిజాం కాలంలో లాగా జప్తు చేస్తున్నారు
- దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వరు
- ఉద్యోగాల్లేవు, నిరుద్యోగ భృతి రాదు
- నోటిఫికేషన్లంటూ ప్రశ్నాపత్రాలు అమ్ముకుంటున్నారు
- బాన్సువాడ సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, పక్కన షబ్బీర్‌అలీ

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ టౌన్/నస్రుల్లాబాద్: రైతులు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు మాఫీ చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, లక్షన్నర ఉద్యోగాలిస్తానని నమ్మించి మోసం చేసిన కేసీఆర్ సర్కారును సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా జిల్లాలో మూడో రోజైన సోమవారం బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండల కేంద్రం నుంచి బొమ్మన్‌దేవ్‌పల్లి చౌరస్తా, కాంశెట్టిపల్లి, నెమ్లి, అంకోల్ క్యాంప్, దుర్కి, దేశాయిపేట చౌరస్తా, సోమేశ్వర్ గ్రామాల మీదుగా బాన్సువాడ పట్టణానికి పాదయాత్ర నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మధ్యాహ్నం పొతంగల్ మండలం సుంకిని గ్రామానికి వెళ్లి వర్షాలతో దెబ్బతిన్న పంటలన పరిశీలించారు. బాన్సువాడ పట్టణంలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయకపోవడంతో అప్పులు పెరిగిపోయాయని, అప్పు చెల్లించడం లేదంటూ సహకార బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి నిజాం కాలంలో లాగా వస్తువులను తీసుకువెళ్తున్నారంటే బాన్సువాడ ప్రాంతంలో అరాచకం ఎలా నడుస్తుందో కనబడుతుందన్నారు. ఇసుక, కంకరను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. రైతుగా చెప్పుకునే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొడుకు చైర్మన్‌గా ఉన్న బ్యాంకు అధికారులే రజాకార్ల లాగా ఊళ్ల మీద పడుతున్నారని పేర్కొన్నారు. 2021లో పదిలక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని పదిహేను నెలలైనా పరిహారం ఎందుకు ఇప్పించలేదని నిలదీశారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునే దిక్కులేదన్నారు. రైతులను మోసం చేసిన కేసీఆర్‌ను ఉరివేయాలని, పోచారంను పాతాళానికి తొక్కాలన్నారు. గిరిజనులకు అసైన్డ్ పట్టాలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా ఉద్యోగాలు ఇవ్వకుండా కాలాయాపన చేసిన ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, ప్రశ్నాపత్రాలు అమ్ముకుందని ఆరోపించారు.

హైదరాబాద్‌కు రేవంత్‌రెడ్డి పయనం

కామారెడ్డిలో మూడు రోజులుగా జోడోయాత్ర నిర్వహించిన రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. పండుగ నేపథ్యంలో మూడ్రోజుల పాటు విరామం ప్రకటించారు. ఈనెల 25న జుక్కల్‌లో తిరిగి యాత్రలో పాల్గొంటారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తాం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందరి కష్టాలు తీరుస్తుందని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రైతుల రుణాలను రూ. 2 లక్షలు మాఫీ చేస్తామని, ఇళ్లు లేని పేదలకు రూ. 5 లక్షలు ఇస్తామని, వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 5లక్షల వరకు అండగా ఉంటామని తెలిపారు. గ్యాస్ సిలిండర్ రూ. 5 వందలకే ఇస్తామని పేర్కొన్నారు. సభలో మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, సిరిసిల్ల రాజయ్య, సురేశ్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే గంగారాం, కాంగ్రెస్ నేతలు కాసుల బాల్‌రాజు, కైలాస్ శ్రీనివాస్, మానాల మోహన్‌రెడ్డి, గడుగు గంగాధర్, కేశ వేణు, నగేశ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుంకిని శివారులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

అన్నదాతను ఆదుకోండి

- ఎకరాకు రూ. 15 వేలు, మామిడి తోటకు రూ. 50 వేలు ఇవ్వాలి
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్
- పొతంగల్‌లోని సుంకినిలో పర్యటన

రుద్రూర్ (పోతంగల్) : రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం సుంకిని శివారులో అకాల వర్షం వల్ల దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర వ్యవసాయ పరిశీలన బృందాలు వెంటనే రాష్ట్రంలో పర్యటించాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఎకరానికి రూ.15వేలు, మామిడి తోటలకు రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం, కేంద్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలన్నారు. 2021 డిసెంబర్‌లో జరిగిన పంట నష్ట పరిహారమే ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. పసల్ బీమా, పంటల బీమా పథకం అమలు లేనందున రైతాంగం ఇబ్బందులు పడుతోందన్నారు.

రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీలు ఎత్తేసి రైతుబంధు పేరుతో ఎకరాకు రూ.పదివేలిచ్చి చేతులు దులుపుకుందన్నారు. రైతు చనిపోయిన తర్వాత ఇచ్చే రైతు బీమా కంటే బతికున్నప్పుడే గిట్టుబాటు ధర పంటనష్టపరిహారం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తెచ్చిన మూడు నల్ల చట్టాలకు సీఎం కేసీఆర్ మద్దతు ఇచ్చాడని అన్నారు. పంట నష్టంపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, డీసీసీ అధ్యక్షుడు మానాలమోహన్ రెడ్డి, బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, కోటగిరి మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గంధపు పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా బీజేపీ ప్రజాప్రతినిధులు

రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. పంట నష్టంపై బీజేపీ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదన్నారు. మతతత్వ రాజకీయాలు తప్ప రైతుల గురించి ఆలోచించట్లేదన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్, ఆయన తనయుల దోపిడి ఎక్కువైందన్నారు. లోన్ కట్టని రైతుల ఇళ్ల తలుపులు తీసుకెళ్తూ రజాకార్ల పాలన తలపిస్తున్నారన్నారు.

ప్రపంచానికి భారత్ జ్ఞానం అందించింది

తెయూ(డిచ్‌పల్లి) : పూర్వాకాలంలో భారత మేధావులు ప్రపంచానికి జ్ఞానం అందించారని అమెరికా రోవన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే.రామానుజాచార్యులు తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో సోమవారం 'ఎన్ ఇంట్రాక్షన్ సెషన్ విత్ స్టూడెంట్స్ అండ్ టీచర్స్ ఆఫ్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్, తెలంగాణ యూనివర్సిటీ విత్ ఫారిన్ డెలిగేట్స్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో చాలామంది టీవీలు, మొబైల్స్ చూడడానికే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు మంచి ఆలోచనలు చేయడం మర్చి పోయారని, విద్యార్థులు మంచిగా ఆలోచించడం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. అటమిక్ సిద్ధాంతం, నానో టెక్నాలజీ గురించి వివరించారు. సిలికాన్‌తో తయారయ్యే చిన్న చిప్‌లో మన యూనివర్సిటీ లైబ్రరీలో ఉన్న మొత్తం పుస్తకాల విషయాన్ని నిక్షిప్తం చేయవచ్చని రామానుజాచార్యులు తెలిపారు. గౌరవ అతిథిగా హాజరైన డాక్టర్ సుధాకర్ (చికాగో, యూఎస్ఏ) మాట్లాడుతూ హైడ్రోజన్ కార్లు, ప్లాటినం కార్లు, సోలార్ ఎనర్జీ, వివిధ బ్యాటరీలు తయారు చేసే విధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, ప్రస్తు తం విదేశాల్లో వృథా ప్లాస్టిక్ ద్వారా డీజిల్, పెట్రోల్ తయారు చేసే పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ మాట్లా డుతూ సైన్స్‌లో కొత్త విషయాలపై పరిశోధనలు మ రింత పెరగాలన్నారు. యూనివర్సిటీ ఫారెన్ రిలేషన్స్ డైరెక్టర్ మామిడాల ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ రామానుజాచార్యులు

క్షయ నిర్మూలనలో జిల్లాకు అవార్డులు

అందుకున్న వైద్యశాఖ అధికారులు

నిజామాబాద్ సిటీ : జిల్లాలో క్షయ నిర్మూనల కార్యక్రమాల అమల్లో జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టీబీ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృతంగా క్షయ నిర్మూలన కార్యక్రమాల్ని నిర్వహించి క్షయ వ్యాధిని 60శాతం నిర్మూలించిన నిజామాబాద్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడు అవార్డులు వచ్చాయి. అందులో మొదటిది నిజామాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా ఎంపిక కాగా, రెండవది జిల్లా క్షయ నియంత్రణ అధికారి డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం రాష్ట్రస్థాయి ఉత్తమ డీటీసీవోగా ఎంపికయ్యారు. మూడవ అవార్డు జిల్లా క్షయ నియంత్రణ సమన్వయకర్తగా రవి గౌడ్ ఎంపిక కావడంతో జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడు అవార్డులు రావడం దక్కాయి. ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లో భారత కేంద్ర ప్రభుత్వ క్షయ నియంత్రణ రీజనల్ డైరెక్టర్ అనురాధ, క్షయ నియంత్రణ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం మాట్లాడుతూ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేయడంతో ఈ అవార్డులు రావటం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్ జిల్లాలో ఎటువంటి కొత్త కేసులు నమోదు కాకుండా క్షయ రహిత జిల్లాగా మారుస్తామన్నారు. ఇందులో భాగస్వాములైన క్షయ నియంత్రణ విభాగ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజా ప్రతినిధులు జిల్లా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డీఎంహెచ్‌వో సుదర్శనం



ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకుంటున్న రవిగౌడ్

మాకూ పే స్కేల్ వర్తింపజేయండి

- ఉపాధి హామీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్
- సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా తమకు జీతాలు పెంచాలంటున్న వైనం



శిక్ష పథకాల కింద పని చేస్తున్న ఉద్యోగులు ప్రభు

మోర్తాడ్(బాల్కొండ): సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడానికి ఉత్తర్వులను జారీ చేయడంతో తమకు కూడా పే స్కేల్‌ను వర్తింప చేయాలని ఉపాధి హామీ, సమగ్ర శిక్ష పథకాల కింద పని చేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాలో 136 మంది, సమగ్ర శిక్షలో 328 మంది వివిధ హోదాలలో పని చేస్తున్నారు. ఏళ్ల తరబడి చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకరావడం ఇబ్బందికరంగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయడంతో జిల్లాలో 216 మందికి ఆర్థిక ప్రయోజనాలు కలుగనున్నాయి.

సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేస్తామని గత ఏడాది సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సెర్ప్ ఉద్యోగుల వేతనాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

కేటాయింపులు చేయకున్నా జీతాలివ్వొచ్చు

ఉపాధి హామీ పథకంకు సంబంధించి ఉద్యోగులకు పే స్కేల్ ప్రకారం వేతనాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయిస్తుంది. ఉపాధి హామీ పనుల కోసం ఖర్చు చేసే నిధులలో పది శాతంను ఉద్యోగుల వేతనాలకు కేటాయించడానికి అవకాశం ఉంది. ఉద్యోగుల వేతనాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి వందల కోట్లలో మిగులుబాటు అవుతున్నాయి.

జిల్లాలో రెండు పథకాల కింద పనిచేస్తున్న ఉద్యోగులు

ఉపాధి హామీ పథకం...

ఏపీవోలు	19
టెక్నికల్ అసిస్టెంట్‌లు	67
కంప్యూటర్ ఆపరేటర్లు	36
ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లు	11
ప్లాంటేషన్ సూపర్‌వైజర్	1
సీడీ డీఎల్‌ఆర్‌సీ	1
అడిషనల్ డీఆర్‌పీ	1
మొత్తం	136

సమగ్ర శిక్ష...

క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు	92
పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌లు	112
ఐఈఆర్‌పీలు	38
కంప్యూటర్ ఆపరేటర్లు	19
కేర్‌టేకర్లు	19
ఎంఐఎస్‌లు	19
మెస్సెంజర్లు	19
డీపీవో ఉద్యోగులు	10
మొత్తం	328

మా శ్రమను గుర్తించాలి..



ఉపాధి హామీ పథకం కింద ఏళ్ల తరబడి పని చేస్తూ ప్రభుత్వానికి ఎంతో శ్రమను దారబోసాం. ఉపాధి కూలీలకు పని కల్పించి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో పాలుపంచుకుంటున్నాం.

– నర్సయ్య, ఏపీవో, ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

విజయవంతంగా పనిచేస్తున్నాం..



సమగ్ర శిక్ష కింద పని చేస్తున్న ఉద్యోగులు విద్యాభివృద్ధి ఎంతగానో కృషి చేస్తున్నారు. ప్రభు త్వం ఏ కార్యక్రమం అప్ప గించినా ఆ పనిని విజయవంతంగా పూర్తి చేస్తున్నాం.

– రవి కిరణ్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు

ఒత్తిడిలోనూ విధులు నిర్వహిస్తున్నారు..



కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వామ్యులైన ఉద్యోగుల పట్ల మానవతా ధృకృథంతో వ్యవహరించాలి. ఉద్యోగులంతా ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నారు.

– దప్పు దిలీప్, జేఏసీ ప్రధాన కార్యదర్శి

దారికొచ్చిన డీజిల్ లెక్కలు..

- బల్దియాలో ఒక నెలలో రూ. 10 లక్షల డీజిల్ ఆదా
- ఏళ్ల తరబడిగా డీజిల్‌ను మింగేసిన శానిటేషన్ అధికారులు
- సమగ్రంగా విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..
- 'సాక్షి' కథనానికి స్పందించిన కమిషనర్



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం : కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగంలో వాహనాలకు డీజిల్ వాడకాన్ని కట్టుదిట్టం చేసి నిఘా పెంచడంతో నెలరోజుల వ్యవధిలోనే రూ. 10 లక్షల వరకు ఆదాయం ఆదా అయిందని అధికారుల లెక్కల్లో తేలింది. మున్సిపల్ వాహనాలకు డీజిల్ వాడకున్నా వాడినట్లు ఖర్చులు చూపించినట్లు ఫిబ్రవరి నెలలో అధికారులు తనిఖీల్లో గుర్తించారు. గతనెల 17న 'సాక్షి'లో డీజిల్‌నూ తాగేశారు అనే కథనం ప్రచురితం కాగా మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా స్పందించారు. వెంటనే విచారణకు ఆదేశించగా ఒక్కో వాహనానికి ప్రతినిత్యం డీజిల్ 12 లీటర్ల పైనే ఖర్చవుతుందని శానిటేషన్ అధికారులు లెక్కలు చెప్పి తప్పించుకున్నారు. అయితే డీజిల్ ఖర్చుకు తగ్గట్లు వాహనాలు తిరగడం లేదని, ఆ మేరకు చెత్త సేకరణ జరగడం లేదని తనిఖీ చేసిన అధికారుల నివేదికల్లో వెల్లడించిన విషయం తెలిసిందే. కమిషనర్ సీరియస్‌గా దృష్టి సారించడంతో శానిటేషన్ అధికారులు కంగుతిన్నారు. డీజిల్ వాడకంపై కమిషనర్ ప్రత్యేకంగా ప్రతినిత్యం నివేదికలు తెప్పించుకున్నారు. ప్రతి వాహనానికి డీజిల్ 8 లీటర్ల లోపు ఉపయోగించాలని ఆదేశాలు ఇచ్చారు.

నిబంధన పెట్టడంతో..

వాహనాల్లో డీజిల్ వాడకంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి వాహనానికి డీజిల్ ఎంత ఉపయోగించాలనో నిబంధనలు పెట్టారు. నగరంలో 6 జోన్ కార్యాలయాలున్నాయి. ఒక్కో జోన్‌లో 15 మినీ టాటాఏస్ వాహనాలు, రెండేసి చొప్పున ట్రాక్టర్ల, స్వీపింగ్ మిషన్లతో పాటు ఐచర్ వాహనాలు ఉన్నాయి. ప్రతి వాహనానికి డీజిల్ 6 నుంచి 9 లీటర్ల లోపు ఉపయోగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఫలితంగా కేవలం ఫిబ్రవరి 18 నుంచి మార్చి 17లోగా ఒకే ఒక్క నెలలో రూ. 10లక్షల వరకు డీజిల్ ఆదా అయ్యిందని అధికారుల లెక్కల్లో తేలింది.

రికవరీ చేస్తారా..?

నగరంలోని ఆయా జోన్‌లకు సంబంధించి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నెలకు రూ. 10 లక్షలకు పైగా అక్రమ డీజిల్ వినియోగంపై కమిషనర్ మండిపడ్డారు. 'సాక్షి'లో వచ్చిన కథనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి కట్టడి చేయడంతో రూ. 10 లక్షల వరకు ఆదా అయ్యాయి. ఈ లెక్కన కొన్నేళ్లుగా ప్రతినెలా అక్రమంగా రూ. 10 లక్షల వరకు డీజిల్ శానిటేషన్ అధికారులే తాగేసినట్లు మున్సిపాలిటీలో ఉద్యోగులే చర్చించుకుంటున్నాను. ప్రతి ఏడాది రూ. 1 కోటి 20లక్షల వరకు అంటే సుమారు ఐదేళ్లలో రూ. 6 కోట్ల వరకు డీజిల్ డబ్బులు జేబుల్లో నింపుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కమిషనర్ మరింత లోతుగా సక్రమంగా విచారించి డీజిల్ దొంగల నుంచి రికవరీ చేస్తారా అని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు సోమవారం సంస్థ జిల్లా చైర్మన్ పి రాజేశ్వర్, ఆర్డీవో శ్రీనివాసులు మధ్యాహ్నం భోజనం ప్రారంభించారు. అభ్యర్థులు అధైర్యపడకుండా మళ్లీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం రాజన్న, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఫస్టియర్ గణితం-1ఏ, రాజనీతి శాస్త్రం, బోటని పరీక్షలు జరిగాయి. ఉర్దూ మీడియం గణితం పేపర్‌లో ఒక ప్రశ్న తప్పుగా వచ్చింది. జిల్లావ్యాప్తంగా 951 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. డీఐఈవో పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ పరీక్షలకు 9771 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 10,306 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 535 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలకు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు. 11 మంది విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌పై వివరాలు రాయలేరని తెలిపారు.

24, 25న బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1 కళాశాలలకు చెందిన విద్యార్థులకు 24న, ఫేజ్ -2 కళాశాలల విద్యార్థులకు 25న పరీక్షలు జరుగుతాయని వివరించారు.

25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజును ఈ నెల 25 వరకు చెల్లించవచ్చని కంట్రోలర్ ఎం.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 64 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఆర్డీవో చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్, నిజామాబాద్ ఆర్డీఓ రవి ఫిర్యాదులు స్వీకరించారు.

వెల్‌నెస్ సెంటర్ మార్చాలి

జీజీహెచ్‌లోగల నాలుగో అంతస్తులో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌ను పెన్షనర్లు, వయోవృద్ధులకు అనుకూలంగా అన్ని వసతులతో కూడిన భవనంలోకి మార్చాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. రామ్మోహన్‌రావు, నారాయణ, ప్రసాదరావు, జార్జ్ ఉన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిరుమల నర్సింగ్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.జిల్లా అధ్యక్షుడు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ తిరుమల నర్సింగ్ కాలేజీలో సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేశారన్నారు. దీనిపై కాలేజీ యాజమాన్యానికి తెలిపినా చర్యలు తీసుకోవడం లేదన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, తదితరులు

జీపీ భవన నిర్మాణం కోసం..

బోధన్ మండలం ఖాజాపూర్ జీపీ భవనం పనులను మాల కులస్తులు అడ్డుకుంటున్నారని, పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పాలకవర్గం, గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



పశుమిత్రలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పశుమిత్రల వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షురాలు నూర్జహాన్ డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. పశుమిత్రలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, జిల్లాలో 60మంది వరకు నాలుగేళ్లుగా పనిచేస్తున్నా.. కనీస వేతనం ఇవ్వడంలేదన్నారు. మౌనిక, లక్ష్మీ పాల్గొన్నారు.

శనగలు కొనుగోలు చేయాలని..

శనగలు కొనుగోలు చేయాలని బోధన్ మండలంలోని హున్సా సొసైటీ పరిధిలోగల ఖాజాపూర్ రైతులు వినతిపత్రం అందజేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటివరకు 30వేల బస్తాల శనగలు కొనుగోలు చేశారని తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో కొనుగోళ్లు నిలిపేశారన్నారు. అధికారులు ఇప్పుడు కోటా పూర్తయ్యిందని చెప్తున్నారని, సుమారు 8వేల బస్తాల శనగలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. శనగ బస్తాలను పూర్తిగా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు.



సంఘ భవన నిర్మాణం ఆపాలని ఫిర్యాదు



ఆర్మూర్ మండలంలోని మచ్చర్లలో సర్వేనంబర్ 6, 7, 8లోగల బావి స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న మాదిగ సంఘ భవన నిర్మాణం ఆపాలని గ్రామస్తులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి నోటీసు అందజేసినా.. లెక్క చేయకుండా మళ్లీ పనులు ప్రారంభించారని ఆరోపించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 23ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి గురువులు దేవేందర్ రెడ్డి, వీరభద్రయ్య, దయానంద్, బాల్‌రాజు, పంచశీల, స్వర్ణలతలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

విద్యార్థులకు 24 గంటల వైద్య సేవలు



తెయూ(డిచ్‌పల్లి): క్యాంపస్ విద్యార్థులకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి 24 గంటలు నాణ్యమైన వైద్య సేవలందించాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి రవీందర్ సూచించారు. తెయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన ల్యాబ్‌ను సోమవారం వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన యంత్రాల ద్వారా బయోకెమికల్ అనలైజర్, ఎలక్ట్రోలైట్ అనలైజర్, సెల్ కౌంటర్ మిషన్, సెంట్రిఫ్యూజ్, బ్లడ్ మిక్సర్ పరీక్షలు నిర్వహించవచ్చన్నారు. అవసరమైన విద్యార్థులు ల్యాబ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది వీసీకి రక్తపరీక్షలు చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, హెల్త్ సెంటర్ వైద్యురాలు అనూష పాల్గొన్నారు.

22 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 22 వరకు కొనసాగుతుందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఉంటే సంబంధిత రేషన్ షాపులలో తీసుకోవాలని ఆయన కోరారు.

రూ.మూడు కోట్లతో ఉడాయించిన వ్యాపారి

కామారెడ్డి టౌన్: ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి రూ.మూడు కోట్లతో ఉడాయించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పలువురు బాధితులు తెలిపిన ప్రకారం.. కామారెడ్డిలోని అయ్యప్ప నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి కొంత కాలంగా ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. మిత్తిలకు, రోజువారిగా ఫైనాన్స్ ఇచ్చేవాడు. చిరువ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా చాలా మంది ఆయన వద్ద చిట్టీలు వేసేవారు. కొందరు ఉద్యోగులు అతనికి మిత్తిలకు రూ.లక్షల్లో ఇచ్చిన్నట్లు తెలిసింది. కాగా ఆయన సుమారు రూ.మూడు కోట్లతో ఉడాయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ వ్యాపారి బెంగళూరులో ఉన్నట్లు సమాచారం. బాధితులు అతని కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు




బాన్సువాడరూరల్: మండలంలోని తాడ్కోల్ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో కోటగిరి మండలం బస్వాపూర్‌కు చెందిన లక్ష్మణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. తన మిత్రుడు రాముతో కలిసి బైక్‌పై వెళ్తుండగా వీరిని లారీ ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరు యువకులను 108 వాహనంలో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాముకు స్వల్పగాయాలు కాగా లక్ష్మణ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

మాక్లూర్: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంచంద్రపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం .. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా పామూరుకు చెందిన రమేష్(55) కుటుంబంతో సహా వచ్చి కొంతకాలంగా ఈ ప్రాంతంలో తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొన్నిరోజులుగా రాంచంద్రపల్లిలో పనులు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం బహిర్భూమికని బయటకు వెళ్లిన రమేష్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి సమీపంలో ఉన్న నీటి కుంటకు వెళ్లి చూడగా అక్కడ రమేష్ (55) పడి ఉన్నాడు. మద్యం తాగి ఉండటంతో బోర్లా పడి ఊపిరి ఆడక మృతి చెంది ఉంటాడని ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.


అనుమానాస్పద స్థితిలో ఒకరు..



భిక్షపతి (ఫైల్)

రాజంపేట: చెరువులో పడి అనుమానాస్పదంగా ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గడ్డల భిక్షపతి (48) శనివారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం చెరువులో ఆయన మృతదేహం తేలింది. భిక్షపతికి చేపలు పట్టే అలవాటు ఉందని, ఈ విషయంలో గతంలో బెస్త సంఘం వారు బెదిరించారని మృతుడి కుమారుడు ప్రవీణ్ తెలిపారు. తన తండ్రి మరణానికి బెస్త సంఘానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా భిక్షపతి మృతదేహాన్ని పంచనామా చేయకుండా తరలించడంతో ఎస్సైపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఐ తిరుపయ్య ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. ఎస్సై తీరుపై ఉన్నతాధికారులకు విన్నవిస్తానని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

చికిత్స పొందుతూ యువకుడు..



మహేష్(ఫైల్)

లింగంపేట/నాగిరెడ్డిపేట: మండలంలోని మాలపాటి గ్రామానికి చెందిన కంపె మహేష్(17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మహేష్ ఈ నెల 12న నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీకొంది. మహేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మహేష్ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరు..

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రణయ్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో మేకల మృతి



ధర్పల్లి(ఇందల్వాయి): కుక్కల దాడిలో నాలుగు మేకల మృతి చెందిన ఘటన ఇందల్వాయి మండలం దేవి తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన డేగావత్ శంకర్ తన ఇంటి బయట మేకలను కట్టేసి ఉంచాడు. ఆదివారం రాత్రి మేకలపై వీధి కుక్కలు దాడి చేయడంతో నాలుగు మేకలు చనిపోయాయి. తండాలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని అధికారులు చర్యలు చేపట్టాలని బాధితుడు శంకర్ కోరారు.

యాసిడ్ తాగి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లిలో గంగాధర్ (49) యాసిడ్ తాగి మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. రెండు రోజుల కిందట ఇంటి వద్ద యాసిడ్ తాగడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో పిల్లలు, యువకులు మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, పిల్లల అలవాట్లపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని సీపీ నాగరాజు సూచించారు. సోమవారం నగరంలోని ఖిల్లారోడ్డు బర్కత్‌పుర రోటరీ కార్యాలయంలో రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోటరీ డైలీ క్లినిక్ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. గంజాయి బానిసలు, బైక్ చోరీలకు పాల్పడుతున్న దాదాపు 300 యువకులను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించామన్నారు. మత్తు పదార్థాల నివారణకు మానసిక వైద్యుడు విశాల్‌తో కౌన్సెలింగ్ ఇప్పించినట్లు చెప్పారు. సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన కల్పించేందుకు త్వరలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఓ కార్యక్రమం చేయాలని సీపీ కోరారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు సతీష్ సాహు మాట్లాడుతూ ఆల్కహాల్, గుట్కా, కల్లు, గంజా, జర్దా, తంబాకు, కొకైన్ మాన్పించడానికి డైలీ క్లినిక్‌లో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మహిళా ఆరోగ్య సమస్యలపై డాక్టర్ కవితారెడ్డి తనవంతు సహకారం అందిస్తారని పేర్కొన్నారు. రోటరీ డైలీ క్లినిక్‌లో చికిత్స పొందాలనుకునేవారు 9246990055, 9908120261 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. క్లబ్ కార్యదర్శి విశాల్ ఆకుల, కోశాధికారి డాక్టర్ హరీష్ స్వామి, ప్రసన్న కుమారి, విజయరావు, శ్రీనివాసరావు, డాక్టర్ నవీన్ మాలు, కవితారెడ్డి, దర్శన్ సింగ్ సోకి, జుగల్‌సోనీ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీ నాగరాజు, తదితరులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట: మండలంలోని బోనాల్ గ్రామంలో ప్రభుస్వామి ఆలయం వద్ద సోమవారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ పరంధాములు, సాయాగౌడ్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి:హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి షౌకత్ జహాన్ సిద్ధిఖీ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి నగర్‌కు చెందిన దండేవాడ లక్ష్మణ్, హైదరాబాద్‌లోని మౌలాలికి చెందిన పల్లపు కుమార్, బోధన్ మండలం జాడి జమాల్పూర్ గ్రామానికి చెందిన బోడ సాయితేజ కలిసి దొంగతనాలు చేసేవారు. వీరు దొంగిలించిన ఓ బైక్‌ను అమ్మగా రూ.18 వేలు వచ్చాయి. ఆ డబ్బును ముగ్గురు పంచుకోవాలని నిర్ణయించారు. కానీ లక్ష్మణ్ సాయితేజకు రూ.ఆరు వేలు ఇవ్వలేదు. దీంతో సాయితేజ ఈ విషయాన్ని పోలీసులకు చెబుతానని బెదిరించడంతో ఆయనను చంపాలని మిగతా ఇద్దరు నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం సాయితేజను 2021 సెప్టెంబర్ 28న మాక్లూర్ మండలం మామిడిపల్లి అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి సాక్ష్యాలు లేకుండా చేశారు. పోలీసులు నేరానికి సంబంధించిన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి ప్రధాన నిందితుడు లక్ష్మణ్‌కు హత్యానేరం కింద జీవిత ఖైదు, సాక్ష్యాలు చేరిపి వేసినందుకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. రెండో ముద్దాయి పల్లపు కుమార్ పరారీలో ఉన్నాడు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కవిత రెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గుండెపోటుతో ఖైదీ మృతి



ఇబ్రహీం మృతదేహం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర శివారులోని సారంగపూర్‌లోని జిల్లా జైలులో ఆదివారం గుండెపోటుతో ఖైదీ మృతి చెందాడు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని సుల్తాన్‌పూర్ గ్రామం వెల్‌గన్ రోడ్డుకు చెందిన ఇబ్రహీం మహబూబ్(69)కు ఖమ్మం కోర్టు మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి 2014 అక్టోబర్ 1న గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. ఇబ్రహీం మహబూబ్‌ను ఖమ్మం పోలీసులు వరంగల్ జైలుకు తరలించారు. వరంగల్ జైలును తీసివేయడంతో 2021 జూన్ 5న నిజామాబాద్ జిల్లా జైలుకు తీసుకొచ్చారు. శనివారం రాత్రి తోటి ఖైదీలతో మాట్లాడి పడుకున్న ఇబ్రహీం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఇబ్రహీం నిద్రలేకపోవడంతో తోటి ఖైదీలు జైలు సిబ్బందికి సమాచారం అందించారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ ఆరో టౌన్ ఎస్సై సాయికుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కస్టోడియల్ మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్: జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పటేల్ లక్ష్మి (30)కి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో ఆమె నాలుగేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి పోశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బూరుగుపల్లికి చెందిన వృద్ధుడు..



జయరాం(ఫైల్)

పెద్దకొడప్‌గల్: మానసిక పరిస్థితి బాగలేనందునా జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బూరుగుపల్లి గ్రామనికి చెందిన కాంబ్లే జయరాం(70) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు జయరాం కుమారుడు విఠల్ ఫిర్యాదు చేశారని ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..



నరేందర్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: మద్యం మత్తు, క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సంగి నరేందర్ (19) ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో అతని కుటుంబసభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన అతడు కొద్దిసేపటి తర్వాత క్షణికావేశంలో ఇంటి వెనుక ఉన్న బావిలో దూకాడు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి బయటకు తీశారు. అప్పటికే అతడు మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొట్టాల లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఆమె సమీప బంధువు మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి వారింటికి వెళ్లింది. సోమవారం అంత్యక్రియల అనంతరం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులోని 15 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ నరహరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 21న బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో అక్కడికి వెళ్లడానికి లాకర్‌లో పెట్టిన బంగారాన్ని శనివారం తెచ్చినట్లు బాధితురాలు తెలిపింది.



చోరీ జరిగిన ఇంటి వద్ద గుమిగూడిన జనం